
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం : 26 : నవంబర్ : 2024



సోమశిలలో 70.65 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 70.65 టీఎంసీల నీరు ఉంది. పెన్నార్ డెల్టాకు 2250, కండలేరుకు 2,100, ఉత్తర, దక్షిణకాలువలకు 1,100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.79,200
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ7,200
3 శాతం జీఎస్టీతో	రూ.7,416
నవర (8 గ్రా)	రూ.59,328

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0 /23.7

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. సోమవారం గాలిలో తేమ 77 శాతం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఓ ఆనంద్

నెల్లూరు రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు జలమయం అయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లా అధికారులు తమ సిబ్బందితో సహాయక చర్యలకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. అత్యవసర సహాయం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 0861-2331261కు సమాచారం అందించాలని కోరారు.

నేడు జాబ్‌మేళా

కోవూరు: ఏపీ స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్, ఉపాధి కల్పన శాఖ, సీడాప్ సంయుక్తంగా కోవూరులోని వైకేఆర్‌అండ్‌కే గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీప్రసూన తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఫ్యూజన్ మైక్రోఫైనాన్స్ లిమిటెడ్, మెడ్‌ప్లస్, కోటక్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ ఫైనాన్స్ ఇంక్లూషన్ లిమిటెడ్, వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హీరో మోటో కార్ప్ లిమిటెడ్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారని వివరించారు. ఎంఎస్సీ, ఐటీఐ డిప్లొమా, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూం కోరారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగులు ఆధార్‌కార్డ్ జెరాక్స్, రెజ్యూమ్‌తో రావాలని, మరిన్ని వివరాలకు 63015 29271, 97045 10793 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఓవరాల్ చాంపియన్ జేబీ కళాశాల



ఓవరాల్ చాంపియన్‌షిప్ కప్‌ను అందజేస్తున్న గాయత్రి

నెల్లూరు (టౌన్): విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీయేట్ గేమ్స్ ఫర్ ఉమెన్ పోటీల్లో కావలి జవహర్ భారతి (జేబీ) డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్నాయి. చివరి రోజు సోమవారం బాస్కెట్‌బాల్ పోటీల్లో వెంకటాచలంలోని అలెక్సా కళాశాల విద్యార్థులు ప్రథమ, కావలి జేబీ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతులు సాధించారు. వాలీబాల్ పోటీల్లో జేబీ కళాశాల ప్రథమ స్థానం, అలెక్సా కళాశాల ద్వితీయ స్థానం, యోగా పోటీల్లో జెనెక్స్ కళాశాల ప్రథమ స్థానం, డీకేడబ్ల్యూ కళాశాల ద్వితీయ స్థానం, టగ్‌ఆఫ్ వార్‌లో డీఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రథమ స్థానం, డీకేడబ్ల్యూ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ఆయా పోటీల్లో విజేతలకు డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి సతీమణి గాయత్రి కప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కార్యదర్శి విజయకళ, పలువురు పీడీలు పాల్గొన్నారు.


విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు

- అన్ని డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లు
- ఎస్ఈ విజయన్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాకు భారీ వర్ష సూచన ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ చెప్పారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో సోమవారం ఆయన జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తుఫాన్‌గా మారే అవకాశం ఉందని, విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలన్నారు. విద్యుత్ సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలోని ప్రధాన విద్యుత్‌భవన్‌తో పాటు 7 డివిజన్ల కేంద్రాల్లో ప్రత్యేక కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామని, వర్షాలు తగ్గే వరకు ప్రతి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఇద్దరు సిబ్బందిని మాత్రమే ఉంచి మిగిలిన వారిని అత్యవసర సేవలకు వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు, రోప్స్, డ్రిల్లింగ్ మెషిన్ వంటి పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ఈఈలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

మేం తాగితే.. ఈ లోకంతో పనిలేదు..







వెంకటేశ్వరపురం సెంటర్‌లో పూటుగా మద్యం తాగి రోడ్లపై పడిపోయిన మందుబాబులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): కూటమి ప్రభుత్వం వచ్చాక ఊరూరా, వీధివీధినా మద్యం దుకాణాలు, బెల్టు షాపులు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయి. ఇరవై నాలుగు గంటలూ మద్యం అందుబాటులో ఉండడంతో మందుబాబులు తాగి తూగుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్దిష్ట సమయంలో మద్యం దుకాణాలు తెరిచి విక్రయాలు చేపట్టడంతో పాటు దుకాణాల వద్ద తాగే పద్ధతికి క్లాం వేసింది. దీంతో మద్యం ప్రియులు ఇళ్లకు తీసుకెళ్లి తాగేవారు. కానీ కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేట్ పరం చేయడంతో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలకు తెరలేపింది. దీంతో మందు బాబులు ఎక్కడపడితే అక్కడ తాగి ఈ లోకంతో మాకు పని లేదన్నట్లుగా రోడ్లపై మత్తులో దొర్లాడుతున్నారు. ఇప్పటికే ఇళ్ల మధ్య, రద్దీ ప్రదేశాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారంటూ మహిళలు, ప్రజాసంఘాలు ఆందోళన చేపడుతున్నా.. ఈ పాలకులకు, అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. నగరంలోని వెంకటేశ్వరపురంలో పూటుగా మద్యం తాగి రోడ్లపై రచ్చ రచ్చ చేస్తూ, ఇలా రోడ్లపై పడిపోతున్న పరిస్థితులు నిత్యం చూసి ఈ ప్రభుత్వానికి ఓట్లు వేసింది ఇందుకేనా? ఈ సమాజం ఏమైపోతుందని ప్రజలు నిలదీస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితులు లేవని అంటున్నారు. కూటమి నేతలు అధికారంలోకి రావడానికి అలవికాని హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయకుండా, ఇలా ప్రజలను మద్యం మత్తులో ఉంచి కాలం గడుపుకుంటున్నారని అభ్యుదయ ప్రజాసంఘాల నేతలు విమర్శిస్తున్నారు.

కూటమి తెచ్చిన కష్టాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ వర్గాల ప్రజలు అనేక రకాలుగా కష్టాలు ఎదుర్కొంటున్నారు. పలు శాఖల్లో పనిచేసే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని, టీడీపీ నేతలు రాజకీయ కక్షతో తమ ఉద్యోగాలు తొలగించారని న్యాయం చేయాలని, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని విద్యార్థులు, ఉద్యోగాలు కల్పించాలని నిరుద్యోగులు, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్లు, జనావాసాల మధ్య మద్యం దుకాణాలు తొలగించాలని సామాన్య మహిళలు ఇలా.. అనేక వర్గాలు కలెక్టరేట్ ఎదుట ప్రతి సోమవారం ధర్నాలు, ర్యాలీలతో నగరం అట్టుడుకుతోంది. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తున్నారు. న్యాయం జరగకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యం అంటున్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి ఆందోళనకరమైన ఘటనలు జరగలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాకే తమ కష్టాలు పెరిగాయని ప్రజలు వాపోతున్నారు.

కలెక్టరేట్ సాక్షిగా న్యాయం కోసం వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు
- న్యాయం చేస్తామని డీఆర్వో హామీ



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వెంగమశెట్టి బాలయ్యను అడ్డుకున్న పోలీసులు

నెల్లూరు (అర్బన్): రెవెన్యూ అధికారులు తనకు అన్యాయం చేస్తున్నారంటూ ఓ వ్యక్తి కలెక్టరేట్ సాక్షిగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక వద్ద అధికారులు, పోలీసులు, ప్రజల సమక్షంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్రమత్తమైన పోలీసులు అతడి చేతిలో అగ్గిపెట్టె లాక్కొని, క్యాన్‌తో నీరు పోసి అడ్డుకున్నారు. ఈ ఘటన సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. విషయం తెలుసుకున్న డీఆర్‌ఓ ఉదయభాస్కర్ రావు బాధితుడి వద్దకు వచ్చి విచారించారు. బాధితుడు వెంగమశెట్టి బాలయ్య కథనం మేరకు.. తనకు కావలి మున్సిపల్ పరిధిలోని బుడమగుంట వద్ద ఇందిరమ్మ కాలనీలో దివంగత సీఎం వైఎస్సార్ హయాం 2007లో ప్రభుత్వం 4 సెంట్ల స్థలాన్ని పట్టాగా ఇచ్చిందన్నారు. తాను చెన్నై వెళ్లి పనులు చేసుకుని 17 ఏళ్లు కష్టపడి రూ.13 లక్షలు సంపాదించుకుని ఇల్లు కట్టుకున్నానన్నారు. అయితే తనకు ఇచ్చిన పట్టాలో సర్వే నంబర్ తప్పు పడిందన్నారు. ఇలా తనతో పాటు మరో 8 మందికి ఇలా సర్వే నంబర్ తప్పు వచ్చిందన్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కృష్ణమూర్తి అనే వ్యక్తి బినామీ పేర్లతో దొంగ పట్టాలు సృష్టించి 2023 నుంచి తన ఇంటిని కబ్జా చేయాలని చూస్తూ తనను అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. అతడికి వీఆర్వో మహేశ్వరరావు, వీఆర్ఏలు భాస్కర్, వెంకయ్య సహకరిస్తున్నారన్నారు. ఈ విషయమై కావలి తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయంలో పలుసార్లు అర్జీలు ఇచ్చి సర్వే నంబర్‌ను సరి చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో విధిలేక కలెక్టరేట్ వద్ద ప్రాణత్యాగం చేశానని బాలయ్య విలపిస్తూ వాపోయాడు. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న డీఆర్వో ఉదయభాస్కర్ సర్వే నంబర్ సరి చేయించి ఇబ్బందులు లేకుండా చేస్తామని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చాడు.

కలెక్టరేట్ ఎదుట వలంటీర్ల ధర్నా



ధర్నా చేస్తున్న వలంటీర్లు

నెల్లూరురూరల్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏపీ గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వలంటీర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ పదో తరగతి నుండి డిగ్రీ వరకు చదివిన వారు వలంటీర్లుగా పని చేస్తున్నారని, గత ప్రభుత్వం వలంటీర్లకు ప్రశంసలు అవార్డులు, రివార్డులు ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజీనామా చేసిన వాళ్లని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10 వేల వేతనం ఇవ్వడంతో పాటు గత ఆరు నెలలుగా పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పెంచలయ్య, బాలు, అనిత, పుష్ప, సుజాత, సీఐటీయూ నాయకులు అల్లాడి గోపాల్, కె పెంచల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ బైక్ ర్యాలీ



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సోమవారం సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని శెట్టిగుంటరోడ్డులో ఉన్న సీపీఎం కార్యాలయం నుంచి పప్పులవీధి, ఆత్మకూరు బస్టాండ్, మినీబైపాస్‌రోడ్డు, ముత్తుకూరుగేటు సెంటర్, వీఆర్సీ సెంటర్, ట్రంకురోడ్డు మీదుగా ఏబీఎం కాంపౌండ్ వరకు ఈ ర్యాలీ నిర్వ హించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం తీసుకు రావాలని, అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల జీవితాలకు భద్రత కల్పించాలని, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చాల ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించే ర్యాలీలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కత్తి శ్రీనివాసులు, కాయం శ్రీనివాసులు, మూలం ప్రసాద్, రాంబాబు, అశోక్, నాయకులు మస్తాన్‌బీ, సూర్యనారాయణ, అంకయ్య, చెంచులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటా సౌరకాంతులు

ఇంటింటా నిరంతరం కాంతులకు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఈ పథకం ద్వారా వినియోగదారులు ఇళ్లపైనే సోలార్ ప్యానల్స్‌ను అమర్చుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది.

– కలిగిరి/సీతారామపురం

పీఎం సూర్య ఘర్‌తో విద్యుత్ బిల్లుల మోతకు చెల్లు

- సోలార్ పద్ధతితో ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి
- రాయితీతో పాటు రుణ సదుపాయం





రూఫ్ టాప్ ప్యానల్స్ రాయితీ వివరాలు

సామర్థ్యం	విద్యుత్ ఉత్పత్తి	ఖర్చు	రాయితీ
1 కిలోవాట్	120 యూనిట్లు	రూ.60 వేలు	రూ.30 వేలు
2 కిలోవాట్	240 యూనిట్లు	రూ.1.40 లక్షలు	రూ.60 వేలు
3 కిలోవాట్	360 యూనిట్లు	రూ.1.99 లక్షలు	రూ.78 వేలు

ఆరు నుంచి ఏడేళ్లలో పెట్టుబడి పొందవచ్చు

పథకం ఇలా పొందాలి

- ఈ పథకాన్ని పొందేందుకు గృహ విద్యుత్ వాడకం 300 యూనిట్ల లోపు ఉండాలి. మొబైల్‌లో సోలార్ ఘర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇంటి విద్యుత్ సర్వీసు నెంబరు, వినియోగదారుని వివరాలు, ఆరు నెలల విద్యుత్ బిల్లుల కాపీలను జత చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- రిజిస్ట్రేషన్ ఫీజు ఎన్ని కిలోవాట్స్ తీసుకుంటామనే దాన్ని బట్టి ఉంటుంది. ఐదు కిలో వాట్లకు రూ.1,900, అంతకు పైబడి రూ.5,990, పది కిలోవాట్లకు పైబడిన హెచ్‌టీ సర్వీసుదారులు రూ.11,800 చెల్లించాలి. మూడు కిలోవాట్లకు లోపు సర్వీసులకు ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదు.
- ట్రాన్స్‌కో అనుమతులు పొందిన తర్వాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఒక కిలో వాట్‌కు రూ.30 వేల చొప్పున సబ్సిడీ మంజూరు చేస్తారు.
- ఇంటి పైకప్పుపై 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్, ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా వినియోగదారులు వాడే విద్యుత్‌ను లెక్కించే అవకాశం ఉంది. వినియోగదారులు పెట్టిన పెట్టుబడిని ఆరు నుంచి ఏడు ఏళ్లలో పొందవచ్చునని సోలార్ కంపెనీలు వెల్లడిస్తున్నాయి.
- సోలార్ ప్యానల్స్, నెట్ మీటర్ అమర్చిన తర్వాత పోర్టల్‌లో బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేయవలసి ఉంటుంది. దీంతో సబ్సిడీ మొత్తాన్ని నెల రోజుల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది.
- 100 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలోవాట్ సామర్థ్యం గల రూఫ్ టాప్‌కు మూడు లేదా నాలుగు ప్యానల్స్‌ను వినియోగిస్తారు. కిలోవాట్ ప్యానల్స్‌కు నెలకు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.
- 5 కిలోవాట్ల సోలార్ ప్యానల్స్‌కు నెలకు 600 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇందులో 300 యూనిట్లు విద్యుత్ ఇంటి అవసరాలకు పోగా మిగిలిన 300 యూనిట్లను విద్యుత్‌శాఖ కొనుగోలు చేసి సదరు మొత్తాన్ని వినియోగదారుల ఖాతాలో జమ చేస్తుంది.



ఇంటి పైన ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

"సద్వినియోగం చేసుకోండి"

సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు రాయితీ ఇవ్వడంతో రుణ సదుపాయం కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఈ పథకానికి సంబంధించి సందేహాలు ఉంటే స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయాల్లో సంప్రదించాలి. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.దినేష్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ, కలిగిరి

కార్తీక దీపకాంతులు







కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శైవ క్షేత్రాలు దీపకాంతులతో విరాజిల్లాయి. వేకువ జాము నుంచే వివిధ రూపాల్లో కొలువైన ఆది దంపతులకు వేదపండితులు పాలు, పంచామృతాలు, విభూతి, రుద్రాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. ముక్కంటి నెలవైన ఆలయాలు హరహర మహాదేవా శంభో శంకరా, ఓం నమః శివాయా నామస్మరణతో పులకించాయి. కార్తీక దీపాలు, విద్యుత్ వెలుగులతో పార్వతీ పరమేశ్వరులు కొలువైన కైలాసాన్ని తలపించాయి. మహిళలు ఉదయం నుంచి ఉపవాస దీక్షలతో దీపాలు వెలిగించి ముల్లోకాలను ఏలే అభయహరుడిని, జగన్మాత పార్వతీదేవిని శివనామస్మరణతో దర్శించుకుని ప్రణమిల్లి ప్రార్థించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

సమస్యల ఏకరువు

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు పోటెత్తిన జనం
- వినతులు స్వీకరించిన కలెక్టర్, అధికారులు
- మొత్తం 280 వినతుల అందజేత

నెల్లూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. వాటిని పరిష్కరించాలంటూ కలెక్టరేట్‌కు పెద్దఎత్తున తరలివస్తున్నారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 280 వినతులు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అందులో ఎక్కువగా రెవెన్యూ అంశాలకు సంబంధించినవే. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, జెడ్పీ సీఈఓ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డ్వామా పీడీ గంగా భవానీ, జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- జిల్లాలో సమగ్ర జనగణనతోపాటు కులగణన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. వింజమూరు మండలంలో భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గురిజాల భాస్కర్ అనే వ్యక్తి వినతిపత్రం ఇచ్చాడు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రివ్యూ మీటింగ్ పెట్టాలని సభ్యుడు మురళీకృష్ణ యాదవ్ కోరారు. అట్రాసిటీ కేసుల పురోగతి, సాంఘిక సంక్షేమ హాస్టల్స్, గురుకుల పాఠశాలల పనితీరు సమీక్షించాలని విన్నవించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నష్ట పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు, రైతులు

ముత్తుకూరు మండలంలోని నేలటూరులో ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్ యాష్‌పాండ్ కట్టకు గండి పడి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆ మండల సీపీఎం కార్యదర్శి గడ్డం అంకయ్య కోరారు. ఆయన రైతులతో కలిసి అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అధికారులు సర్వే చేసి జాబితాను జెన్కో అధికారులకు ఇచ్చారన్నారు. వారు వెంటనే ఆర్డీఓకి చెక్కు రూపంలో నగదు ఇచ్చేశామని రైతులకు తెలియజేశారన్నారు. ఆర్డీఓకు ఇచ్చిన చెక్కును వెంటనే బాధిత రైతులకు ఇవ్వాలని కోరారు.

ఎన్నో బాధలు.. కదిలిస్తే కన్నీటి సుడులు

- ఆస్తి కోసం ఇంటి నుంచి గెంటేశారని ఓ తండ్రి ఆవేదన
- ఎస్పీ ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 77 ఫిర్యాదుల అందజేత



బాధితురాలి సమస్యను పరిష్కరించాలని ఫోన్‌లో సిబ్బందిని ఆదేశిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'ఆస్తి విషయమై కుమారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారయ్యా. చిత్రహింసలు పెడుతున్నారు. విచారించి నాకు న్యాయం చేయండి' అని బోగోలుకు చెందిన ఓ వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశాడు. 'నా కుమారులు ఉదయ్ కిరణ్, సుబ్రహ్మణ్యంలు ఆస్తి కోసం వేధిస్తున్నారు. ఇంటి నుంచి గెంటేశారు' అంటూ మనుబోలుకు చెందిన ఓ వ్యక్తి కన్నీటి పర్యంతమయ్యాడు. ఉద్యోగం పేరిట మోసగించారు.. అత్తింటి ఆరళ్లను తట్టుకోలేకున్నాం.. కుమారుడి మరణంపై అనుమానం ఉంది.. ఇలా ఒక్కొక్కరిది ఒక్కోగాథ.. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో జిల్లా కేంద్రానికి వచ్చారు. సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు వినతులిచ్చారు. స్పందించిన ఎస్పీ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఆస్తి కోసం తల్లిదండ్రులను వేధించే పిల్లలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 77 మంది విచ్చేసి ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు నగర, రూరల్, డీటీసీ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ 1, 2, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసులురెడ్డి, దశరథ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- భర్త చనిపోయి పుట్టింట్లో ఉంటున్న తనను ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని మేనమామ తీవ్రంగా కొడుతున్నాడని విచారించి న్యాయం చేయాలని కోవూరుకు చెందిన మహిళ వినతిపత్రం ఇచ్చారు.
- ప్రముఖ బ్యాంకులో పీఓ ఉద్యోగం ఇప్పిస్తానని వేదాయపాళేనికి చెందిన బెనర్జీ రూ.25 లక్షలు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకుండా, నగదు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని వేదాయపాళేనికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- కోర్టులో ఉన్న కేసును రాజీ చేసుకోవాలని బెంగళూరుకు చెందిన రూప్‌కుమార్ అతని అనుచరులు బెదిరిస్తున్నారని, ఇబ్బందులకు గురిచేస్తున్నారని తోటపల్లిగూడూరుకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- తన రెండో కుమారుడి మరణం అనుమానాస్పదంగా ఉందని లోతుగా దర్యాప్తు చేసి నిజాలు వెలికితీసి నిందితులపై చర్యలు తీసుకోవాలని నవాబుపేటకు చెందిన ఓ మహిళ వినతిపత్రం అందజేశారు.
- తన బావ ఇస్మాయిల్ ఫోన్‌లో బెదిరిస్తూ వేధిస్తున్నాడని, కుటుంబంలో వివాదాలు ఏర్పడ్డాయని అతడిపై చర్యలు తీసుకోవాలని వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

ఒకే ప్రాంతంలో.. గంటల వ్యవధిలో..

- రైలు కింద పడి ఇద్దరి ఆత్మహత్య



యువకుడి మృతదేహం



ఉదయం ఆరు గంటలకు ఆత్మహత్య చేసుకున్న యువకుడు

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టం వచ్చిందో తెలియదు గానీ ఒకే ప్రాంతంలో గంటల వ్యవధిలో ఇద్దరు గుర్తుతెలియని యువకులు రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డారు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో గుర్తుతెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి వయసు 25 నుంచి 30 ఏళ్లలోపు ఉంటుందని భావిస్తున్నారు. నలుపు రంగుపై తెలుపు చెక్స్ గల ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు.

పది గంటలకు..

నక్కలోళ్ల సెంటర్‌లో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై సోమవారం ఉదయం 10 గంటలకు గుర్తుతెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి వయసు సుమారు 30 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. నలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, గ్రే కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఈ ఘటనలపై నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య కేసులు నమోదు చేశారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

- జేసీ కార్తీక్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జేసీ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లోని క్యాంప్ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్ల లావాదేవీలు, ఫ్రీ హోల్డ్ భూ సమస్యలపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హౌస్‌హోల్డ్ సర్వే, లిట్రసీ సర్వేలు వేగంగా చేయాలని కోరారు. హౌసింగ్ శాఖలో చివరిదశలో ఉన్న నిర్మాణాలు తక్షణమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్లను ఎంపిక చేసి సంక్రాంతి నాటికి వాటిని పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు పెంచాలన్నారు. పల్లెల్లో ఉన్న ఓహెచ్‌ఆర్ ట్యాంకులను శుభ్రం చేయాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థులకు అపార్‌కార్డులను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఉదయభాస్కర్, జెడ్పీ సీఈఓ విద్యారమ, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవానీ, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఈఓ బాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ, పీఆర్ ఎస్‌ఈ అశోక్ కుమార్, పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, మైక్రో ఇరిగేషన్ పీడీ శ్రీనివాసులు, ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో నుంచి కింద పడిన మహిళ

- చికిత్స పొందుతూ మృతి

కావలి: ఆ ఆటోలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్నారు. ఈ సమయంలో ఓ మహిళ జారి రోడ్డుపై పడింది. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందిన ఘటన సోమవారం కావలిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావలి పట్టణం, రూరల్ నుంచి జలదంకి మండలంలో వ్యవసాయ పనులకు ఆటోలో అధిక సంఖ్యలో మహిళలు బయలుదేరారు. ఇందులో పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న టిడ్కో కాలనీలో నివాసం ఉంటున్న మహిళలు కూడా ఉన్నారు. ఆటో కొద్దిసేపటికే పట్టణంలోని బొట్లగుంట వద్దకు చేరుకునే సరికి మితిమీరిన వేగం కారణంగా అదుపుతప్పగా డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో టిడ్కో కాలనీకి చెందిన బొగ్గవరపు సునీత అలియాస్ కామాక్షమ్మ (36) రోడ్డుపై పడిపోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కావలి రెండో పట్టణ ఎస్సై ఎం.గోపీచంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లోకి చొరబడి వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇంటికి రావొద్దని హెచ్చరించిన ఓ వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచిన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం వైఎస్సార్ నగర్‌కు చెందిన సురేష్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన సంతోష్ మరో ఇద్దరు అతడికి పరిచయమయ్యారు. అందరూ స్నేహంగా ఉంటూ తరచూ సురేష్ ఇంట్లో మద్యం తాగేవారు. ఇటీవల వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. సురేష్ వారిని తన ఇంటికి రావొద్దని హెచ్చరించాడు. దీంతో కక్ష పెంచుకున్న సంతోష్, మరో ఇద్దరు ఈనెల 22వ తేదీ రాత్రి సురేష్ ఇంట్లోకి చొరబడి అతడిపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు సోమవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సుపారీ ఇచ్చి.. పక్కా స్కెచ్ వేసి..



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు, చిత్రంలో నిందితులు

- అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై దాడి, దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్
- పరారీలో సూత్రధారి

నెల్లూరు(క్రైమ్): వినాయక ఉత్సవాల్లో జరిగిన వివాదంతో కక్ష పెంచుకున్న ఓ వ్యక్తి రౌడీషీటర్లు, కొందరు వ్యక్తులకు సుపారీ ఇచ్చి అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై దాడి చేయించాడు. నిందితులు ప్రొఫెసర్ ఒంటిపైనున్న బంగారు ఆభరణాలను సైతం దోచుకెళ్లారు. ఈ ఘటనలో ఇద్దరు రౌడీషీటర్లతోపాటు మరో ఇద్దరు వ్యక్తులను నెల్లూరు చిన్నబజారు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఓ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. సంగంకు చెందిన శ్రీనివాస మోహన్‌తేజ గూడూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. అతడి పిన్ని మూలాపేట వేళాంగిణి స్కూల్ సమీపంలో ఉంటున్నారు. మోహన్‌తేజ ఈనెల 21వ తేదీ సాయంత్రం కళాశాల బస్సులో ఆ స్కూల్ వద్ద దిగి పిన్ని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా రెండు మోటార్‌బైక్‌ల్లో వచ్చిన ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు అడ్డుకున్నారు. అతడిపై దాడి చేసి ఒంటిపైనున్న నాలుగున్నర సవర్ల బంగారు గొలుసు, ఒకటిన్నర సవర్ల బ్రాస్‌లెట్‌ను దోచుకుని పరారయ్యారు. ఈ మేరకు బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా దోపిడీకి పాల్పడింది శెట్టిగుంట రోడ్డు పాత చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ అబ్దుల్ అజీజ్, మైపాడురోడ్డుకు చెందిన రౌడీషీటర్ షేక్ బబ్లూ, స్టోన్‌హౌస్‌పేటకు చెందిన సుదర్శనం, సంగం మండలానికి చెందిన రూపేష్‌లు, మరో బాలుడిగా గుర్తించారు.

విచారించగా..

నలుగురు నిందితులను సోమవారం శెట్టిగుంటరోడ్డు పాతచెక్‌పోస్టు వద్ద ఇన్‌స్పెక్టర్ అరెస్ట్ చేశారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా దాడి, దోపిడీ వివరాలను వెల్లడించారు. సంగంలో సెప్టెంబర్ నెలలో జరిగిన వినాయక ఉత్సవాల్లో శ్రీనివాస్ మోహన్‌తేజకు అదే ప్రాంతానికి చెందిన వేరొకరికి మధ్య వివాదం జరిగింది. దీంతో కక్ష పెంచుకున్న సదరు వ్యక్తులు కోవూరుకు చెందిన తమ బంధువు సురేంద్రరెడ్డిని సంప్రదించారు. ఎలాగైనా శ్రీనివాస్ మోహన్‌తేజపై కక్ష తీర్చుకోవాలని కోరారు. దీంతో సురేంద్రరెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై దాడి చేయాలని నిందితులకు రూ.25 వేలు సుపారీ ఇచ్చాడు. దీంతో నిందితులు రెండు రోజులు రెక్కీ వేశారు. ఈనెల 21వ తేదీ సాయంత్రం శ్రీనివాస్‌పై దాడి చేయడమే కాకుండా ఒంటిపైనున్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లారని విచారణలో వెల్లడించారు. దీంతో నిందితుల నుంచి రూ.2.50 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, దోపిడీకి వినియోగించిన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో సురేంద్రరెడ్డిని అరెస్ట్ చేయాల్సి ఉందని, దాడికి పురమాయించిన వ్యక్తులు ఎవరో తెలియాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నెల్లూరు రూరల్ మండలం వెంగళరావ్‌నగర్‌లో ఏసుపాదం అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. పెయింటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి ఏసుపాదం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకెళ్లాడు. అప్పటి నుంచి అతడి జాడ తెలియరాలేదు. బాధిత కుటుంబసభ్యులు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

కాశీ విశ్వేశ్వరునికి రుద్రాభిషేకం



కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో పీఠాధిపతి, సురేష్‌రెడ్డి

సంగం: మండలంలోని సంగం తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో సోమవారం పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కార్తీక మాసం 4వ సోమవారం సందర్భంగా సంగం ఆర్యవైశ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి మాట్లాడుతూ భగవంతుడిని పూజిస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు గునుపూడి గిరిబాబు, వేమా మల్లికార్జునరావు, గుప్తా, రామారావు, శ్రీరాం, మల్లికార్జున సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చేపల వేటకు విరామం



ఈపూరు పట్టపుపాళెంలో ఒడ్డున పడవలు

ముత్తుకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారినందున మత్స్యకారులు చేపల వేటకు విరామం ప్రకటించారు. సముద్రంలో వాతావరణం ప్రతికూలంగా ఉంది. దీంతో నేలటూరు, కృష్ణపట్నం, ఈపూరు పట్టపుపాళెం మత్స్యకారులు ముందు జాగ్రత్తగా పడవలు, వలలను ఒడ్డుకు చేర్చుకుని భద్రపరుచుకున్నారు. అధికారులు కూడా వేటకు వెళ్లొద్దని హెచ్చరించడంతో అధిక సంఖ్యలో మత్స్యకారులు గ్రామాలకే పరిమితమవుతున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్త, అత్తింటివారిపై మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కోవూరుకు చెందిన స్పందనకు ఇందుకూరుపేటకు చెందిన చంద్రశేఖర్‌తో 2010లో వివాహమైంది. ఆ సమయంలో ఆమె కుటుంబసభ్యులు రూ.3 లక్షల నగదు, 30 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.లక్ష విలువైన గృహోపకరణాలను కట్నకానుకల కింద చంద్రశేఖర్ కుటుంబసభ్యులకు ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం భర్త, అత్తింటివారు ఆమెను రూ.2 లక్షల అదనపు కట్నం కోసం వేధించసాగారు. ఈ మేరకు బాధితురాలు సోమవారం మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 92
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 174
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 194
లేయర్ చికెన్	: 187



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.35		పండ్లు :
సన్నవి : రూ.25		రూ.15

